క్లుప్తంగా

తాగునీటి వసతిపై పరిశీలన



నాగిరెడ్డిపేట: మండలంలోని గోలిలింగాల, చీనూర్ గ్రామాలలో నేషనల పంచాయితీ అవార్డు (ఎస్‌పీఎం)లకు సంబంధించి శుక్రవారం ప్రత్యేకాధికారులు రమేష్‌బాబు, మధు పరిశీలించారు. గోలిలింగాలలో తాగునీటి వసతులను రమేష్‌బాబు, చీనూర్‌లో అంగన్‌వాడి కేంద్రాన్ని, పాఠశాలను మధు పరిశీలించారు. అనంతరం వారు స్థానికులతో మాట్లాడారు. వారివెంట ఎంపీవో శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శులు మహేష్‌గౌడ్, సరేందర్ ఉన్నారు.

జంతు సంరక్షణపై అవగాహన



భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జంతు సంరక్షణపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. పశువైద్యాధికారి దేవేందర్, సర్పంచ్ స్వామి, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు డెస్కుల వితరణ



భిక్కనూరు: మండలంలోని కాచాపూర్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి సర్పంచ్ తోగరి సులోచన, మాజీ ఎంపీపీ తోగరి సుదర్శన్ దంపతులు రూ. లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన బీర్కూరి లింగం పాఠశాల విద్యార్థుల కోసం ఆరు డెస్కులను అందజేశారు. అదేవిధంగా వీడీసీ అధ్యక్షుడు మర్రి మహిపాల్ సీసీ కెమెరాలు, ఎంపీపీ గాలిరెడ్డి రూ. 20 వేలు ప్రకటించారు.

ఎక్సైజ్ అధికారుల తనిఖీ



దోమకొండ: దోమకొండ ఎక్సైజ్ శాఖ పరిధిలోని బీబీపేట, యడారం, రాంరెడ్డిపల్లె గ్రామాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ పోతారెడ్డి తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకొచ్చినా, విక్రయించినా పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చారించారు. ఆయన వెంట ఎక్సైజ్ కానిస్టేబుళ్లు జీవన్, శరత్, సాగర్, మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలి



నాగిరెడ్డిపేట: నిరంతరాయంగా సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని మండలంలోని చీనూర్ గ్రామస్థులు గ్రామ సభలో తీర్మానించారు. శుక్రవారం సర్పంచ్ సౌందర్య అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయాలని కోరారు. పంచాయతీలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల వివరాలను కార్యదర్శి సరేందర్ చదివి వినిపించారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



నస్రుల్లాబాద్: మండల కేంద్రంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో ఎంపీపీ పాల్త్య విఠల్ శుక్రవారం విద్యార్థులకు దుప్పట్లు, బ్యాగులు, బూట్లు పంపిణీ చేశారు. అనంతరం హాస్టల్ వసతితో పాటు భోజనం నాణ్యత గురించి ఆయన విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ పెర్క శ్రీనివాస్, నాయకులు ప్రతాప్, ప్రభాకర్ రెడ్డి, కంది మల్లేష్, వెంకట రమణ, పురం వెంకటి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


రుణాలు సకాలంలో చెల్లించాలి



సదాశివనగర్: మహిళా సంఘ సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని ఏపీఎం రాజిరెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. స్త్రీనిధి రుణాలను తీసుకొని అభివృద్ధి సాధించాలని ఆయన కోరారు. డీపీఎం రామచంద్రగౌడ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కుంట రజిత, సీసీలు రాములు, లింగం, ఆంజనేయులు, నరేందర్‌రెడ్డి, సౌజన్య పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు కన్పిస్తే కబ్జా

- బాన్సువాడ మున్సిపల్ పరిధిలో పలుచోట్ల ఆక్రమణలు
- ఆక్రమణదారులకు అండగా అధికారులు
- కనుమరుగు అవుతున్న విలువైన భూములు



బాన్సువాడ టౌన్: అధికారుల అలసత్వం, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం కారణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వరంగా మారింది. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో పలుచోట్ల ఉన్న ఖాళీ స్థలాలపై అక్రమార్కుల కన్నుపడింది. భూముల విలువ రోజు రోజుకు పెరిగిపోతుండటంతో ఖాళీ స్థలం కనబడితే చాలు కబ్జా చేస్తున్నారు. అక్రమార్కులకు అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి బాన్సువాడలో కొంతకాలంగా ప్లాట్ల క్రయ విక్రయాలు కొనసాగిస్తున్నాడు. ఈయన ప్రభుత్వ స్థలం ఎక్కడ ఖాళీగా ఉంటే వాటి పక్కనే ప్రైవేటు స్థలంను కొనుగోలు చేసి ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తుంటాడు. ముఖ్యంగా సాయికృపా నగర్, బస్‌డిపో ముందు, బోర్లం రోడ్డు, చైతన్య కాలనీలో ఉన్న మున్సిపల్ స్థలాలపైనే ఆయన కన్నేశాడు. ఇటీవల బాన్సువాడ మున్సిపాలిటీకి చెందిన ఎల్‌పీ నంబర్ 29లో 10 శాతం ప్రభుత్వ స్థలాన్ని పద్మశాలి సంఘం భవన నిర్మాణానికి మున్సిపల్ అధికారులు అనుమతి ఇచ్చారు. వాటి పక్కనే రియల్ ఎస్టేట్ వ్యాపారికి సంబంధించిన స్థలంనుండటంతో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో కొంత ఆక్రమించుకొని తన స్థలంలోకి కలుపుకుని హద్దులు పాతాడు. దీంతో తమకు కేటాయించిన స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారి కబ్జా చేసిన విషయాన్ని పద్మశాలి సంఘం సభ్యులు మున్సిపల్ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇవే కాకుండా వాగులు, నాలాలను కబ్జా చేసి తన వెంచర్లలో కలుపుకుంటున్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో ముందుగా రేకుల షెడ్లు వేసి అనంతరం మున్సిపల్ సిబ్బందికి అమ్యామ్యాలు సమర్పించి స్థలానికి మున్సిపాలిటీలో నంబర్లు కేటాయించుకుంటున్నారనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. అక్రమార్కులకు మున్సిపల్‌లో పని చేసే ఓ అధికారి అండదండలు పుష్కలంగా ఉన్నాయి. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సి అధికారులే మామూళ్లకు ఆశపడి చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రభుత్వ ఖాళీ స్థలాలు కనుమరుగవుతున్నాయి.

కబ్జా వాస్తవమే

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో బస్ డిపో సమీపంలో పద్మశాలి సంఘ భవన నిర్మాణం కోసం మున్సిపాలిటీకి చెందిన కొంత స్థలాన్ని కేటాయించాం. స్థలం పక్కన ఉన్న ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కొంత స్థలాన్ని కబ్జా చేశాడు. మున్సిపల్ అధికారులను పంపి కబ్జాకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం. స్థలాల ఆక్రమణకు సంబంధించి రియల్ ఎస్టేట్ వ్యాపారిపై ఇప్పటికే పలు ఫిర్యాదులు అందాయి. – జంగం గంగాధర్, మున్సిపల్ చైర్మన్, బాన్సువాడ

కనీస వేతనాలు అమలు చేయాలి



కామారెడ్డిలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



బాన్సువాడలో..

కామారెడ్డి టౌన్: అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కామారెడ్డి అంగన్‌వాడి ప్రాజెక్ట్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకపోతే మార్చి ఒకటో తేదీ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తామని తెలిపారు. అనంతరం పీడీకి వినతిపత్రం అందజేశారు. యూనియన్‌కు చెందిన కల్పన, లక్ష్మి, సునంద, పద్మజ, సుజాత, యాదమ్మ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : సమస్యలు పరిష్కరించకపోతే మార్చి ఒకటో తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు సీఐటీయూ నాయకులతో కలిసి అంగన్‌వాడి టీచర్లు సీడీపీవో కార్యాలయంలో సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సురేష్, మోతిరాం నాయర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ముందు శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు నాగారపు ఏల్లయ్య మాట్లాడుతూ ఐసీడీఎస్‌కు నష్టం కలిగించే నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు బాబాయ్, రాధమ్మ, రాణి, అనురాధ, మీనా తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ టౌన్: అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనంతో పాటు పెన్షన్, ఈఎస్‌ఐ అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బాన్సువాడలో అంగన్‌వాడి ఉద్యోగులు ధర్నా చేశారు. సీఐటీయూ నాయకుడు రవీందర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ల యూనియన్ నాయకులు రాధ, వజ్ర, రోజా, శివగంగా, చుక్కమ్మ, సీఐటీయూ నాయకుడు ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



లింగంపేట కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు



మద్నూర్‌లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

లింగంపేట: మండల కేంద్రంలోని కంటి వెలుగు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా మానవాభివృద్ధి అధికారి రమేశ్ పరిశీలించారు. లింగంపేట, మోతె గ్రామాలకు చెందిన 99 మందికి కంటి అద్దాలు, మందులు అందజేసినట్లు తెలిపారు. కంటి సమస్య ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, వైద్యురాలు హిమబిందు,యాదగిరి, రాజేశ్వరి,శ్రీకాంత్,మేహార్ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: మండల కేంద్రమైన లెండి క్యాంప్‌లో 138 మంది కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు బస్వారాజ్, అశిత, సుజాత, శ్రీకాంత్, సంగీత తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: మండలంలోని సముందర్ తండాలో 111 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఐదుగురికి అద్దాలు పంపిణీ చేశారు. ఒకరికి ఆపరేషన్ అవసరం ఉందని గుర్తించినట్లు సూపర్‌వైజర్ నాగమణి తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం శైలజా, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: మండలంలోని మౌళాన్‌ఖేడ్ గ్రామంలో ఎంపీపీ మాధవి కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోశవ్వ, ఎంపీవో ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీని ధ్వంసం చేయడం సరికాదు



కామారెడ్డి టౌన్: మండలంలోని చిన్న మల్లారెడ్డి గ్రామంలో బీజేపీ మహిళా పోరుకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ధ్వంసం చేసిన అధికార పార్టీ నేతలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు శుక్రవారం దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిళలకు రావాల్సిన వడ్డీ లేని రుణాలు, అభయ హస్తం, శ్రీనిధి వడ్డీ బకాయిల విడుదల కోసం 30న బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉద్యమానికి సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ధ్వంసం చేయడం సరికాదని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీ

పెద్దకొడప్‌గల్: స్పౌజ్ కోటాలో పలువురు టీచర్లను బదిలీ చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు సి.వేణు, పి సుజాత, జి అంజని శుక్రవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు.

ఉచిత పశువైద్య శిబిరం

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్‌లో కోరుట్ల పశువైద్యశాల, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 789 పశువులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వాటికి చికిత్సలు జరిపించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి దేవేందర్,బీఎంఎస్ చైర్మన్ లోహిత్‌రెడ్డి పాలకేంద్రం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి,సర్పంచ్ స్వామి, పశువైద్య సిబ్బంది క్రిష్ణ, ఆహల్య, మహేష్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ వివాదంపై విచారణ

లింగంపేట: మండలంలోని కొర్పోల్ గ్రామంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా చోటు చేసుకున్న ఘర్షణకు సంబంధించి ఎస్సై శంకర్ శుక్రవారం విచారణ చేపట్టారు. జెండా ఆవిష్కరణకు సంబంధించి సర్పంచ్ భర్త నర్సింలు, ఉపసర్పంచ్ కొడుకు పోచయ్య వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఘర్షణలో ఉపసర్పంచ్ కొడుకు పోచయ్య కూడా గాయపడినట్లు తెలిపారు.

క్యాలండర్ల ఆవిష్కరణ

భిక్కనూరు: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ క్యాలండర్లను సర్పంచ్ తున్కి వేణు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, శ్రీసిద్ధరామేశ్వరాలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సహించం



బాన్సువాడలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు



నస్రుల్లాబాద్‌లో మాట్లాడుతున్న నాయకులు

బాన్సువాడ టౌన్: స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై బీజేపీ నాయకుల అనుచిత వ్యాఖ్యలు సహించమని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో నాయకులు మీడియాతో మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గం అన్నింటా అభివృద్ధి చేసేందుకు స్పీకర్ పోచారం తీవ్ర కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మతసామరస్యానికి నిలయంగా ఉన్న బాన్సువాడలో బీజేపీ నాయకులు చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, పాత బాలకృష్ణ, మోహన్‌నాయక్, ఏజాస్, గోపాల్‌రెడ్డి, శ్రీధర్, జంగం గంగాధర్, గడుమల లింగం, బుల్లెట్ రాజు, ప్రశాంత్, రుక్మిణి, కిరణ్, శ్రీనివాస్, జుబేర్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌పై విమర్శలా?

బాన్సువాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్‌పై బీజేపీ నాయకుడు మాల్యాద్రిరెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడటం శోచనీయం అని దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో దళిత సంఘాల నేతలు మీడియాతో మాట్లాడుతూ సూపరింటెండెంట్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాల్యాద్రిరెడ్డి అంబేద్కర్ చౌరస్తా వద్ద బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత సంఘాల నేతలు బండారు మైశయ్య, రవీందర్, ప్రశాంత్, మల్లూరి సాయిలు, వెంకటేష్, మన్నే చిన్న సాయిలు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూడండి

నస్రుల్లాబాద్: బాన్సువాడ నియోజకవర్గాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని, ఆయన్ను విమర్శించే స్థాయి బీజేపీ నాయకుడు మాల్యాద్రిరెడ్డికి లేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ అన్నారు. నస్రుల్లాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ నాయకులు మాత్రమే హిందువులు, ఇతర పార్టీ నాయకులు హిందువులు కారా అని ప్రశ్నించారు. ఎంపీపీ విఠల్, జిల్లా కో ఆప్షన్ మెంబర్ మజీద్, వైస్ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు వెంకటరమణ, కంది మల్లేష్, ప్రతాప్ సింగ్ పాల్గొన్నారు.

ఇళ్లల్లో పోలీసుల సోదాలు

మద్నూర్: చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మదన్‌హిప్పర్గాలో శుక్రవారం డీఎస్పీ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్‌లో భాగంగా పలు ఇళ్లలో సోదాలు నిర్వహించి అనంతరం వాహనాలను తనిఖీ చేశారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీఐ కృష్ణ, ఎస్సై శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

‘కల్యాణ లక్ష్మి’ పేదలకు వరం

నిజాంసాగర్: ఆడ పిల్లల తల్లిదండ్రులకు కల్యాణ లక్ష్మి పథకం దేవుడిచ్చిన వర మని ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో పలువురి లబ్ధిదారులకు ఆయన కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, సత్యనారాయణ, మనోహర్, వాజిద్ అలీ, రమేష్‌గౌడ్, లక్ష్మినారాయణ, లక్ష్మారెడ్డి, అంజయ్య, నారాయణ, రమేష్ కుమార్, రాములు, అబ్బల్, తహసీల్దార్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులతో లబ్ధిదారులు

ఎల్‌వోసీ అందజేత

సదాశివనగర్: మండల కేంద్రానికి చెందిన బండి గంగామణి అనారోగ్యానికి గురి కావడంతో చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.2 లక్షల ఎల్‌వోసీని గంగామణి భర్త తిరుపతికి బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బీరయ్య, ఉపసర్పంచ్ వంకాయల రవి, ఏఎంసీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, కో ఆప్షన్ సభ్యుడు అల్తాఫ్, నాయకులు గాధారి అశోక్‌రెడ్డి, జేపి నర్సయ్య, చంద్రశేఖర్, డిష్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం

రామారెడ్డి: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం కేసీఆర్ చేస్తున్న మోసాలను ఇంటింట తీసుకెళ్తున్నట్లు ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి వడేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. పాదయాత్రలో భాగంగా శుక్రవారం మండలంలోని గొల్లపల్లి, రంగంపేట ఉప్పల్‌వాయి గ్రామాలలో హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గొలపల్లిలో ఆయన మాట్లాడుతూ పోడు భూముల పంచాయితీని మధ్యలో వదిలేశారన్నారు. ప్రజావ్యతిరేఖ విధాలను అవలంభిస్తున్న బీఆర్‌ఎస్ సర్కార్‌ను గద్దే దించే వరకు కాంగ్రెస్ పోరాటం సాగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మోహన్ రెడ్డి, పోసానిపేట సర్పంచులు గీరెడ్డి మహేందర్ రెడ్డి, తూర్పు సుబ్బయ్య, నామాల రవి, శ్రీనవాస్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి


ఆధ్యాత్మికం

ఘనంగా బోనాల పండుగ



ఎల్లారెడ్డిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసాన్‌పేట గ్రామంలో శుక్రవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి రేణుకా ఎల్లమ్మకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుజాత, స్థానికులు సిద్ధిరాంగౌడ్, సాయాగౌడ్ పాల్గొన్నారు.

శబరి మాత పల్లకీ సేవ



తాడ్వాయి: మండల కేంద్రమైన తాడ్వాయి శబరి మాత ఆశ్రమంలో గురువారం రాత్రి పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శబరి మాత దివ్యసమాధి, ప్రతిమను వివిధ రకాల పూలతో అలంకరించారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్: మండలంలోని మైలారం గ్రామంలోని కొచ్చరి మైసమ్మ ఆలయం శుక్రవారం భక్తులతో సందడి నెలకొంది. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



దోమకొండ: ఆలయాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని కాంగ్రెస్‌కు చెందిన మాజీ మంత్రి షబ్బీర్‌అలీ అన్నారు. శుక్రవారం మండలంలోని అంచనూరు గ్రామంలో పోశమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఆలయానికి అభివృద్ధికి ఎన్నో నిధులు ఇచ్చినట్లు వెల్లడించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఇలియాస్, మద్ది చంద్రకాంత్‌రెడ్డి, అనంతరెడ్డి, స్వామి, సీతారం మధు, గోపాల్‌రెడ్డి, బాల్‌రాజ్, పోశమ్మ ఆలయకమిటి ప్రతినిధులు నరేష్, సుమన్, లక్ష్మయ్య, గంగయ్య, కాశయ్య, రాజయ్య, ఏల్లయ్య తదితరులు ఉన్నారు.

సంక్షిప్తం

మద్యం బాటిళ్ల ధ్వంసం

బిచ్కుంద: అనుమతిలేకుండా విక్రయిస్తూ పట్టుబడ్డ 452 మద్యం బాటిళ్లను శుక్రవారం ధ్వంసం చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటక మద్యం విక్రయిస్తే తమకు సమాచారం అందించాలని సీఐ కోరారు. కార్యక్రమంలో డీటీఎఫ్ సీఐ విజయ్ కుమార్, ఎస్సై అభిషేక్ సిబ్బంది పాల్గొన్నారు.

కుంభమేళాకు తరలిన బంజారాలు

ఎల్లారెడ్డిరూరల్: మహారాష్ట్రలోని గోద్రిలో 30 తేదీ వరకు జరగనున్న బంజారాల కుంభమేళా కార్యక్రమానికి పలు గ్రామాలకు చెందిన బంజారాలు శుక్రవారం తరలివెళ్లారు. కుంభమేళాలో బంజారాల గురువు బాబుసింగ్ ప్రవచన కార్యక్రమం ఉంటుందని ఆ సంఘం నాయకులు ఓంకార్ తెలిపారు.

డ్రోన్ ద్వారా మందు పిచికారి చేయాలి

రాజంపేట: డ్రోన్ ద్వారా పంటలకు మందు పిచికారి చేసే విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం సాయిలు రైతులకు సూచించారు. ఎకరానికి రూ. 600 లు చెల్లించి యంత్రాన్ని వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. దీని ద్వారా రైతులకు ఖర్చు కూడా తక్కువ అవుతుందన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

తాడ్వాయి: మండలంలోని సంగోజీవాడి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ప్రవీణ్ నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. తన తండ్రి తెనుగు సంగయ్య జ్ఞాపకార్థం పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

ఏడీ చిత్రపటం వద్ద నివాళి

భిక్కనూరు: ఆత్మహత్య చేసుకున్న మండలంలోని తిప్పాపూర్‌కు చెందిన పశుసంవర్ధకశాఖ ఏడీ శ్రీశైలం చిత్రపటానికి ఆ శాఖ సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోక స్వామి, పాల కేంద్రం అధ్యక్షుడు లక్ష్మరెడ్డి, పశువైద్యాధికారి దేవేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక చట్టం అమలు చేయాలి

- మిగులు భూములను కూలీలకు పంచాలి
- ఏఐకేఎంఎస్ డిమాండ్

డిచ్‌పలి(మోపాల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టం అమలు చేసి, ప్రభుత్వ మిగులు భూములను వ్యవసాయ కూలీలకు పంపిణీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సాయాగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మోపాల్ తహసీల్దార్ లతను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాలకుల తప్పుడు విధానాలు, విచ్చలవిడి పెట్టుబడి, యాంత్రీకరణ పెరగడం వల్ల వ్యవసాయ కార్మికులకు నిజ వేతనాలు, పని దినాలు రోజు రోజుకు తగ్గిపోతున్నాయన్నారు. ఒక వ్యవసాయ కార్మికుడికి రోజుకు కనీసం రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో ఒక కుటుంబానికి 100 రోజుల పని దినాలు కల్పిస్తారని ఆశపడితే కనీసం 45 రోజులు పని కూడా కల్పించలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. మోపాల్ మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 449లో గల 13 ఎకరాల 17 గుంటల ప్రభుత్వ భూమిలో అనుమతి నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. సర్వే జరిపి అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.